నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 28 ఏప్రిల్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY



## పోరాటంలో ప్రజలంతా గెలవాలి..


నడిగడ్డలో పుట్టిన నేను 26 ఏండ్లు రాష్ట్రానికి, దేశానికి సేవ చేశా. ఏడేండ్ల సర్వీసు మిగిలి ఉండగానే ప్రజాసేవ చేయాలనుకున్న క్రమంలో పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. అధినేత ఆశీర్వాదంతో నన్ను పార్లమెంట్‌కు పంపించండి. కేసీఆర్ పాలనలో, ఆయన మార్గదర్శంలో గురుకులాలను ప్రపంచపటంలో పెట్టాను. నాగర్‌కర్నూల్ గడ్డను పార్లమెంట్‌లో నిలిపే అవకాశం ఇవ్వండి. నిరంతరం మీ మధ్యలోనే ఉంటాను. నేను పార్లమెంట్‌కు పోతే నిరుద్యోగులు, రైతు కూలీలు, విద్యార్థులు అక్కడికి పోయినట్లే. కేసీఆర్ ఆశయానికి, రేవంత్ రెడ్డి అహంకారానికి మధ్య జరుగుతున్న పోరాటమిది. కొండ చిలువలు ఓడిపోవాలి.. చలిచీమలమైన మనం గెలవాలి. తెలంగాణ అమరవీరుల ఆశయాలకు ద్రోహం చేసిన కాంగ్రెస్, బీజేపీలకు మధ్య జరుగుతున్న పోరాటంలో ప్రజలంతా గెలవాలి.

*- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ కందనూలు పార్లమెంట్ అభ్యర్థి*

- జనవాహినిని తలపించిన కేసీఆర్ బస్సుయాత్ర
- మూడు కిలోమీటర్ల పొడవునా ఘన స్వాగతం

డప్పులు, షేర్ బ్యాండ్, డీజేలతో హోరెత్తించిన శ్రేణులు





నాగర్‌కర్నూల్‌లో కార్నర్ మీటింగ్‌కు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

# కదం తొక్కిన కందనూలు

- అడుగడుగునా మహిళల మంగళహారతులు
- అభిమాన నేతను పూల వర్షంతో ముంచెత్తిన జనం
- హోరెత్తిన సీఎం.. సీఎం నినాదాలు

కందనూలు కదంతొక్కింది.. అభిమానం ఉప్పొంగింది.. పల్లెలన్నీ కదిలాయి.. ప్రజలు తరలొచ్చారు.. జనం చేతుల్లో గులాబీ జెండాలు రెపరెపలాడాయి.. జై తెలంగాణ నినాదాలు మిన్నంటాయి.. దారులన్నీ గులాబీమయం అయ్యాయి.. పటాకుల మోతలు హోరెత్తాయి.. జై కేసీఆర్, జైజై బీఆర్‌ఎస్ నినాదాలు మార్మోగాయి.. ఉయ్యాలవాడ నుంచి మొదలైన బీఆర్‌ఎస్ రోడ్‌షోకు ప్రజలు నీరాజనం పలికారు.. దారిపొడవునా మహిళలు మంగళహారతులు పట్టారు.. అభిమాన నేత, గులాబీ దళపతిని కనులారా చూసేందుకు ప్రజలు వేలాదిగా తరలిరాగా పట్టణం జనసంద్రమైంది.. బస్టాండ్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో గులాబీ బాస్ ప్రసంగానికి జై కొట్టారు.. ప్రజలు ఫిదా అయిపోయి ఈలలు, చప్పట్లతో మద్దతు తెలిపారు.. అధినేత దిశానిర్దేశంతో క్యాడర్‌లో నూతనోత్తేజం నిండింది.. పాలమూరు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్లలో జరిగిన బస్సు యాత్ర దిగ్విజయంగా ముగిసింది.

*- నెట్‌వర్క్ నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 27*



## కాంగ్రెస్, బీజేపీ మెడలు వంచుదాం

- రెండు పార్టీలకుక ర్రుకాల్చి వాతపెట్టాలి
- రైతు కష్టాలు చెబితే ఇంత దుర్మార్గమా..?
- విద్యావంతుడైనఆ ర్‌ఎస్పీనిఎం పీగాగెలి పించాలి
- రాబోయే రోజుల్లో మళ్లీ వచ్చేది మనమే..
- బస్సు యాత్రలోబీఆ ర్‌ఎస్‌అ ధినేత కేసీఆర్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే.. కాంగ్రెస్‌ను దించాలన్న ఆలోచన ప్రజల్లో వచ్చింది.. సీఎం రేవంత్‌రెడ్డి సంస్కారహీనమైన భాష మాట్లాడుతున్నరు.. తెలంగాణ తొలి సీఎంగా పనిచేసిన నన్ను పట్టుకొని నీగుడ్లు పీకి గోటీలాడుకుంట.. నీ పేగులు తీస్తా అంటున్నారు.. తెలంగాణకు మంచి చేసిన నన్ను పట్టుకొని ఇన్ని మాటలనొచ్చా.. ముస్లింలంతా ఆలోచించాలి.. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీనే గెలుస్తుంది, జీవితాంతం సెక్యులర్ పార్టీగా ఉండే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి' అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో వేలాదిమంది ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగైదు నెలల్లోనే 230 మంది రైతులు చనిపోయారు. కరెంట్ లేదు, రైతుబంధు రాదు, ఐదెకరాలకు మించిన రైతులకు రైతుబంధు ఇవ్వమంటున్నరు.. మిగతా రైతులు ఏం పాపం చేశారు? రైతులకు సాయం చేయని ప్రభుత్వం ఎందుకు? మోదీ హయాంలో భారత్ వికసించిందా? ఒక్క మెడికల్ కాలేజీ అయినా ఇచ్చారా? పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇచ్చారా? నవోదయ విద్యాలయాలు ఇచ్చారా? కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాత పెట్టాలి. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించి నాకు బలం ఇవ్వాలి.' అని అధినేత పిలుపునిచ్చారు. ఈరోజు చాలా గొప్పదినం. పార్టీ ఆవిర్భవించిన రోజు. 23 ఏండ్ల కిందట తెలంగాణ సాధించాలని పిడికెడు మందితో గుండె ధైర్యం తెచ్చుకొని ఉక్కు సంకల్పంతో యుద్ధాన్ని ప్రారంభించిన రోజు.. మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ సాధించుకున్నామని, ఆ గౌరవం ఎప్పుడూ మహబూబ్‌నగర్‌కు ఉంటదన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తండ్రి చనిపోయినప్పుడు హైదరాబాద్ నుంచి గద్వాలకు 200 కిలోమీటర్లు బస్సులో ప్రయాణిస్తూ వరికోతలు, వరి మిషన్లు, ధాన్యపురాశులను చూసి తనకు ఆనందం కలిగిందన్నారు. నా పాలమూరు ఇంత బాగైందని సంతోషపడ్డానన్నారు. అడ్డగోలు హామీలిచ్చి, దుష్ప్రచారాలు చేసి కేవలం ఒకటిన్నర శాతం ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎండింది ఎండగా.. తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పెడితే 20రోజులైనా కొనే దిక్కు లేదన్నారు. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకమన్నారు. ఈ బాధ ఎందుకొచ్చిందో ఆలోచన చేయాలన్నారు. బోర్లు, నీళ్ల ట్యాంకర్లు, బిందెలు మోసే పరిస్థితి ఎందుకొచ్చిందన్నారు. ఐదెకరాలకు రైతుబంధు ఇస్తామంటున్నారని, కనీసం 10-15ఎకరాల వరకైనా ఇవ్వాలి కదా? ప్రభుత్వ సహకారం లేకుండా వ్యవసాయం జరుగదన్నారు. నాలుగైదు నెలలకే ఎందుకింత దుర్మార్గమని ప్రశ్నించారు. ఈ దుర్మార్గ కాంగ్రెస్ మెడలు వంచాలంటే మీ బలం కావాలి.. ఈ ఎన్నికల్లో మద్దతివ్వాలని కోరారు. యువకులు బుద్ధితో ఆలోచించాలన్నారు. మోదీ నూరు నినాదాలు చెప్పారని.. బీజేపీ అక్కరకు రాని చుట్టమన్నారు. గుజరాత్ సీఎం కందనూలులో మీటింగ్ పెడితే 1,500 మంది కూడా రాలేదన్నారు. దేశంలో 157 మెడికల్ కాలేజీలు పెట్టిన మోదీ, రాష్ట్రానికి ఒక్కటీ ఇయ్యలేదన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంతో ప్రజలు బాగుపడుతరని, వట్టెం రిజర్వాయర్ ఆరాటపడి కట్టుకున్నం, జాతీయ హోదా ఇవ్వమన్నం, రూ.25వేల కోట్లు సాయమడిగితే నయా పైసా సాయం చేయలేదన్నారు. రైతుల మోటర్లకు మీటర్లు పెట్టాలి, లేకుంటే రూ.5వేల కోట్ల గ్రాంట్ ఇవ్వమన్నారని, తల తెగిపడినా మీటర్లు పెట్టనని చెప్పినట్లు కేసీఆర్ గుర్తు చేశారు. ఎవరికి కర్రుకాల్చి వాత పెట్టాలో నిర్ణయించేది ప్రజలేనన్నారు. ధర్మాన్ని,బీఆ ర్‌ఎస్‌ను గెలిపించండి.. మళ్లీ మన ప్రభుత్వమే వస్తుందన్నారు.

**ముస్లింలు ఆలోచించాలి..**

రాష్ట్రంలో ఏం జరుగుతుందో ముస్లింలు ఒకసారి ఆలోచించాలన్నారు. దేశంలో మొదటిసారి ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇమామ్‌లు, మౌజమ్‌లకు గౌరవవేతనం ఇచ్చామన్నారు. ముస్లిం పిల్లల కోసం గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీనే గెలుస్తుందన్నారు. ముస్లిం యువత, పెద్దలందరూ సెక్యులర్ పార్టీ అయిన బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. పాలమూరు, కందనూలులో మనమే గెలుస్తున్నామని, ఎలాంటి అనుమానం లేదన్నారు.

**ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ప్రశంసల వర్షం**

ఇక్కడ చదువుకున్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ గెలవాలన్నారు. ప్రవీణ్ అల్లాటప్ప అధికారి కాదని, మీరు బలమిస్తే ఈ సీఎం మెడలు వంచుతామన్నారు. గురుకుల విద్యార్థులు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేలా చేసిన కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి అని కొనియాడారు. చదువుకున్న వాళ్లు రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామమన్నారు. కార్నర్ మీటింగ్‌లో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## పోటెత్తిన ప్రజానీకం

- కందనూలులో కార్నర్ మీటింగ్
- ఉర్రూతలూగించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : కందనూలులో కేసీఆర్ బస్సు యాత్రకు నీరాజనం పలికారు. జిల్లా కేంద్రం గులాబీమయమైంది. కిలోమీటర్ల పొడవునా పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. భారీ ఊరేగింపు అనంతరం మాజీ ఎమ్మెల్యే మర్రి ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో చేసిన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపగా, ప్రజలను ఆలోచింపజేసింది.

**కేసీఆర్ జైత్రయాత్ర..**

నాగర్‌కర్నూల్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర జోష్‌గా సాగింది. మహబూబ్‌నగర్ నుంచి సాయంత్రం 6గంటల సమయంలో జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ వద్దకు చేరుకొన్నది. కేసీఆర్ వస్తుండటంతో సాయంత్రం 4గంటల నుంచే వేలాది మంది ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రానికి చేరుకొన్నారు. ఉయ్యాలవాడ వద్ద కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. బ్యాండ్ మేళాలు, షేర్‌బాజాలు, మహిళలు మంగళహారతులతో ఆహ్వానించారు. పటాకులు కాల్చారు. ప్రధాన రహదారి గులాబీ మయమైంది. పిల్లలు, మహిళలతోపాటు వృద్ధులు సైతం కేసీఆర్‌ను చూసేందుకు రోడ్లపైకి వచ్చారు. ఉయ్యాలవాడ నుంచి జిల్లా కేంద్రం వరకు దాదాపుగా గంటన్నరపాటు కేసీఆర్ బస్సు యాత్ర జరగడం గమనార్హం. యువకులు, పార్టీ నాయకులు జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. బస్టాండ్‌కు చేరుకున్న కేసీఆర్‌ను చూసిన వెంటనే వేలాది మంది పెద్దఎత్తున నినాదాలు చేస్తూ మద్దతు ప్రకటించారు. భారీ గజమాలతో సన్మానం చేశారు. బస్సు నుంచి టాప్‌పైకి కేసీఆర్ చేరుకోగానే సీఎం సీఎం అంటూ పెద్ద ఎత్తున నినదించారు. కేసీఆర్ ప్రసంగం ప్రారంభించగానే ప్రజలు నినాదాలతో హోరెత్తించారు. దాదాపుగా అరగంటపాటు సాగిన కేసీఆర్ ప్రసంగాన్ని ఆసాంతం ఆసక్తిగా విన్నారు. కేసీఆర్‌ను బస్సులో నుంచి చూడగానే ప్రజలు చేయెత్తి నమస్కరించగా, ఇందుకు ఆయన రెండు చేతులతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు నాగం జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు కేసీఆర్‌తో మాట్లాడుతూ బస్సు యాత్రలో ఉయ్యాలవాడ నుంచి బస్టాండ్‌కు చేరుకొన్నారు. కాంగెస్ పాలనలో తులం బంగారం, కల్యాణలక్ష్మి వస్తుందా.. రైతుబంధు అందరికీ వచ్చిందా.. మహిళలకు రూ.2,500 వచ్చాయా అనగా రాలేదంటూ అరుస్తూ, చేతులూపుతూ కేసీఆర్‌కు మద్దతు పలికారు. ఉద్యమ సమయంలో నాగర్‌కర్నూల్‌కు చాలా సార్లు వచ్చానని గుర్తుచేశారు. పదేండ్ల కాలంలో చేసిన అభివృద్ధి, కందనూలులో వచ్చిన మార్పును ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుస్తుందని, ఆర్‌ఎస్ ప్రవీణ్‌లాంటి విద్యావంతుడు రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామమని, ఇలాంటి గొప్ప వ్యక్తిని ఎంపీగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ బస్సు యాత్ర కందనూలులో జోష్‌ను నింపింది. యువకులు మెడపై గులాబీ కండువాలు వేసుకొని, జై కేసీఆర్ అంటూ ఊరేగింపులో సంబురంగా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో కేసీఆర్, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, నాగం, మాజీ ఎమ్మెల్యేలు మర్రి, బీరం

## పత్తాలేని పోలీస్ యంత్రాంగం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉద్యమనేత, పదేండ్లపాటు తెలంగాణను పాలించిన కేసీఆర్ మహబూబ్‌నగర్‌లో బస చేస్తే పోలీస్ యంత్రాంగం తగిన భద్రత కల్పించకపోవడం స్పష్టంగా కనిపించింది. బస్సుయాత్ర సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్‌ను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. కేసీఆర్ కాన్వాయ్ పట్టణంలో ప్రవేశించినా పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. కేసీఆర్ మాజీ మంత్రి నివాసం వద్ద శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఉన్నప్పటికీ పోలీసులు, సిబ్బంది ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

## పాలమూరు సత్తా చాటాలి

- ఎట్టిపరి స్థితుల్లోనూ మన స్థానం నిలబెట్టుకోవాలి
- మాజీఎమ్మె ల్యేలంతా శ్రేణులతో కలిసి పనిచేయాలి
- పాలమూరు సమీక్షలోకేసీ ఆర్



మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో ఎంపీ మన్నె, మాజీ మంత్రులు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాలమూరు పార్లమెంట్ స్థానంలో సత్తా చాటాలని పార్టీ క్యాడర్‌కు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ నివాసంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలతో గులాబీ బాస్ కేసీఆర్ శనివారం సమీక్ష నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు చేపట్టాల్సిన కార్యాచరణ వ్యూహాల మీద చర్చించారు. మహబూబ్‌నగర్ స్థానం ముందునుంచే మంచి పట్టు ఉన్న స్థానమని.. ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలని మాజీ ఎమ్మెల్యేలకు కేసీఆర్ సూచించారు. ఈ స్థానం నుంచి ఎంపీగా ఉండి తెలంగాణను సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 'ఆ రోజు పాలమూరు ప్రజలు టీఆర్‌ఎస్ పార్టీని గుండెల్లో పెట్టుకొని ఆదరించారు.. ఆ తర్వాత రెండుసార్లు వరుసగా గులాబీ విజయానికి బాటలు వేశారు' అని గుర్తు చేశారు. బస్సుయాత్ర సందర్భంగా పాలమూరులో వచ్చిన జన సందోహమే మన పార్టీ విజయానికి తొలిమెట్టు అని.. దీన్ని ఇలాగే కంటిన్యూ చేయాలన్నారు. పాలమూరులో గెలిస్తే రాష్ట్ర రాజకీయాలే మారిపోతాయని.. అందరూ కలిసికట్టుగా శ్రమించి పార్టీ అభ్యర్థి మన్నెను గెలిపించాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వకపోవడం, బీజేపీ బూటకపు వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కరెంటు కోతలు, రైతుబంధు పింఛన్లు, ఇతరత్రా అంశాలను గ్రామీణస్థాయిలో చర్చకు పెట్టాలని దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని, గ్రామీణస్థాయి వరకు ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్యేలు వివరించారు. పదేండ్ల పాలనలో రైతులు, వృద్ధులు, మహిళలు, అనేక వర్గాలు సంతృప్తిగా ఉండేవని.. కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే వ్యతిరేకత మూట గట్టుకుందని.. దీన్ని విస్తృతంగా ప్రచారం చేస్తామని చెప్పారు. కాగా సమావేశంలో రెండుసార్లు కరెంటు పోయింది. సమీక్షలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ సమీక్షలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో ఆర్‌ఎస్పీ, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

## ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే..

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రి నివాసంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికలపై సమీక్షించారు. బస్సు యాత్ర తర్వాత మర్రి నివాసానికి వెళ్లిన కేసీఆర్ ఎన్నికల్లో గెలుపు వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మంచి ఆదరణ వస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందని, ప్రజల చూపు బీఆర్‌ఎస్‌వైపు ఉందని చెప్పినట్లు తెలిసింది. సిట్టింగ్ స్థానం కైవసం చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు. సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.